

మన్యంలో ముమ్మర తనిఖీలు

ప్రజాశక్తి-చింతపల్లి: ఆగస్టు 3 వరకు మావోయిస్టులు నిర్వహిస్తున్న వారోత్సవాలను దృష్టిలో ఉంచుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ శాఖ భద్రత చర్యలను కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. ఈ క్రమంలో మన్య ప్రాంతాల్లోకి అనుమానాస్పద వ్యక్తులు ప్రవేశించకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు నిఘాను మరింత పటిష్టం చేసింది. సీఐ ఎం. వినోద్ బాబు పర్యవేక్షణలో మంగళవారం హనుమాన్ జంక్షన్, లోతుగడ్డ జంక్షన్, కోరుకొండ ప్రాంతానికి వెళ్లే లోతుగడ్డ వంతెన వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్సై ఎం. వెంకటరమణ మాట్లాడుతూ వారోత్సవాల పేరుతో ఏదైనా అవాంఛనీయ చర్యలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ధనంజయ్ పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

సమస్యల నడుమ కమలతోట

- కలుషిత నీటితో ప్రబలుతున్న వ్యాధులు
- మంజూరు కాని పిఎం జన్ మన్ గృహాలు
- శిథిలావస్థలో పాఠశాల భవనం
- హామీలను మరిచిన అధికారులు



అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజనుడు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలంలోని మాదల పంచాయతీ మారుమూల కమలతోట గ్రామంలో కనీస సురక్షితమైన తాగునీరు అందని పరిస్థితి. దీంతో కలుషితమైన గెడ్డ నీరే వారికి ఆధారమవుతుంది.ఆ కలుషితమైన నీరు తాగి గతంలో 25 మంది గిరిజనులు అనారోగ్యంతో మంచాన పడ్డ పరిస్థితి నెలకొంది.గ్రామంలో ప్రస్తుతం ఇప్పటికే కలుషితమైన గడ్డ నీరు తాగి గగ్గు, జలుబు, జ్వరాలతో కొర్ర లచ్చుమ్మ, కొర్ర లక్ష్మి, కొర్ర చిట్టన్న అనారోగ్యంతో వారం రోజులుగా బాధపడుతున్నారు. గతంలో అధికారులు గ్రామంలో పర్యటించి తాగునీరు సమస్య పది రోజుల్లోపు పరిష్కరిస్తామని నేటికీ రెండు నెలలు గడుస్తున్న నేటికీ తాగునీరు సమస్య పరిష్కరించ లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

గ్రామంలో సుమారు 46 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నారు.అందులో తొమ్మిది పీవీటీజి కుటుంబాలు ఉన్నారు. వారికి పీఎం జన్ మన్ ఇల్లులు ఒక్క కుటుంబానికి కూడా మంజూరు కాలేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో కనీసం రోడ్ సౌకర్యం, అంగన్వాడి, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలి పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పాఠశాలలో కనీసం ఇప్పటివరకు ఉపాధ్యాయులు లేరు.మధ్యాహ్న భోజనం పథకం అమలు అవుతుంది తప్ప పాఠశాలకు విద్యాబోధించే ఉపాధ్యాయులు లేరని దీంతో విద్యార్థుల భవిష్యత్ ఏంటి అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామం ఆంధ్ర,ఒరిస్సా బోర్డర్ చివరి గ్రామం కావడంతో ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతినిధులు గాని గ్రామంలో సందర్శించి తమ సమస్యలను గుర్తించ లేదన్నారు. రోడ్ సౌకర్యం లేక ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం తీసుకోవడానికి 18 కిలోమీటర్ దూరంలో నందివలస గ్రామం వరకు కాలినడకన వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి గ్రామంలో సురక్షితమైన తాగునీరు వివిధ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సమస్యలు చెబుతున్న గ్రామస్తులు



గెడ్డలో కలుషిత నీటిని తోడుతున్న గిరిజన మహిళలు

కమలతోట గ్రామంలో తాగునీరు సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేపడుతామని పేసా కమిటి కార్యదర్శి పి రామన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కలుషితమైన గెడ్డ నీరు తాగి గిరిజనులు అనారోగ్యం పాలవుతున్నారని అయిన అధికారులకు తమకు ఏదో పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. రోడ్డు సౌకర్యాలు లేక ఎవరికైనా అనారోగ్యం పాలైనప్పుడు డోలి మోతతో గెడ్డ వాగు దాటి ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో తీసుకెళ్లి ఆంధ్ర ప్రాంతానికి ఆసుపత్రిలో తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొందని గ్రావస్తులు అప్పలరాజు, ఎస్ సింహాద్రి, కె రాంబాబు, జి అప్పరావు, జి పరామ్మ, వి బోజమ్మ, కె సుజాత, కె లక్ష్మి, కె కన్నమ్మ, జి చిట్టమ్మ, కె సీతమ్మ తెలిపారు.



తోటపల్లి బ్రిడ్జి వద్ద గోదావరి

స్వల్పంగా తగ్గిన గోదావరి వరద

ప్రజాశక్తి - ఎటపాక : రెండు రోజులుగా వర్షాలు కురవకపోవడంతో గోదావరి కాస్త శాంతించింది. భద్రాచలం వద్ద గోదావరి వరద సోమవారం రాత్రికి 36.50 అడుగులకు చేరుకుని మంగళవారం ఉదయం వరకూ నిలకడగా ఉంది. మంగళవారం ఉదయం నుండి క్రమేపి తగ్గుతూ సాయంత్రానికి 35 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. కింద ఉన్న గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

మండలంలో 3 ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి- వై.రామవరం : మండలంలో 3 ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఎంపిడిఒ బాపన్నదొర తెలిపారు. వై.రామవరం, పాతకోట, కానివాడా, గ్రామ సచివాలయంలో ఆధార్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, వీటిని ఐటిడిఎ పిఒ ఏర్పాటు చేశారని, ఈ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆధార్‌లో మార్పులు చేయించుకునేందుకు వీటిని వినియోగించుకోవాలని తెలిపారు.

సిఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం సిఐగా సన్యాసినాయుడు మంగళవారం ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. గతంలో రాజవొమ్మంగి సిఐగా బాధ్యతలు నిర్వహించిన సన్యాసినాయుడు ఇటీవల జరిగిన బదిలీల్లో రంపచోడవరం సిఐగా వచ్చారు. రంపచోడవరం సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



సిఐ సన్యాసినాయుడు



సిఐ గోపాలకృష్ణ

చింతూరు : చింతూరు సర్కిల్ సిఐగా మంగళవారం చిత్రాడ గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మోతుగూడెం, డొంకరాయి, చింతూరు ఎస్సైలు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాల్సిందే..

-సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన



నినాదాలు చేస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, తదితరులు

ప్రజాశక్తి అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్టులు రద్దు చేయాల్సిందేనని సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో హైడ్రో పవర్ ప్రోజెక్టుల అనుమతులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తు ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా జడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ, మన్యంలో జిల్లాలో అనుమతులను ప్రభుత్వం రద్దు చేసినట్టు ప్రకటించడం సంతోషమే కానీ, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోట, టోకురు -చిట్టెంపాడు, గుమ్మకోట -గుజ్జెలిలో కూడా రద్దు చేయాలన్నారు. 5 వ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టాన్ని, పేసా చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వం విడుదల చేసిన అక్రమ జి.వొల అనుమతులు కూడా రద్దు చేయాలన్నారు. డుంబ్రిగుడ మండలంలో చైనా క్లే పోరాటంలో తరిమి కొట్టిన చరిత్ర అల్లూరి జిల్లా ప్రజలదని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వాలు అయినా గిరిజన చట్టాలు, హక్కులు జోలికి వస్తే తిరుగు బాటు తప్పదని, తరిమి కొడతామని హెచ్చరించారు ఇప్పటికైనా ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి సిపిఎం మండల కార్యదర్శి, టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, మండల నాయకులు సోమెల.నాగులు, గెమ్మెల దేవన్న, కాకర సింగులు, వంతల బుద్రయ్య, జన్ని భీమన్న, గెమ్మెల భీమరాజు, మహిళా సంఘం నాయకురాలు దేముడమ్మ పాల్గొన్నారు.

మినీ రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీ ప్రాంతాల్లో ఎండియు వాహనాలు రద్దు చేసినందున తక్షణమే చిన్న రేషన్ దుకాణాలు ఏర్పాటుపై ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పలనర్స ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పాడేరు గిరిజన సంఘం కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షులు ఎస్.ధర్మన్న పడాల్, దాస్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఏజెన్సీలో రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రతి రేషన్ కార్డు దారులు 5-20 కిలోమీటర్లు నడిచి బియ్యం, రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వర్షాకాలంలో వాగులు దాట లేక సకాలంలో రేషన్ సరుకులు అందటం లేదని తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు ఇది సమస్యగా మారిందన్నారు. వర్షాకాంలో రోడ్డు దెబ్బతిన్నపుడు రేషన్ సరుకుల పంపిణీకి తీవ్రమైన జాప్యం జరుగు తుందన్నారు. రేషన్ దుకాణం వద్ద నుండి సరుకులు తెచ్చుకోవడానికి వ్యయప్రయాసలు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ నిర్ణయాన్ని పున్ణ సమీక్షించి యధావిధిగా ఎండియు వాహనాల ద్వారా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎండియు వాహనాల ద్వారా నెలకు లక్ష 40 వేల టన్నుల రేషన్ బియ్యం అందించారన్నారు. ఒక్కొక్క వాహనానికి ఇద్దరు చొప్పున జిల్లా మొత్తంగా 442 మంది ఉపాధి పొందేవారన్నారు.ఈ పద్ధతి రద్దు చేయడంతో వారందరూ ఉపాధి కోల్పోయారన్నారు. ఈ విధానం యధావిధిగా కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పివిటిజి గిరిజన కుటుంబాలకు అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గుర్తేడు ఎస్ఐగా వెంకయ్య

ప్రజాశక్తి- వై.రామవరం: గుర్తేడు ఎస్ఐ వెంకయ్య, మండలంలో అప్పర్‌పార్టలో ఉన్న పోలీస్‌స్టేషన్లో ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న, ఎస్సై పార్ధసారథి, దుశ్చార్తి బదిలీపై వెళ్లారు అతని స్థానంలో వెంకయ్య బాధ్యతలు స్వీకరించారు.

అన్నదాత సుఖీభవ అందించాలి

ప్రజాశక్తి - విఆర్‌పురం: పోలవరం ముంపు బాధితులకు కూడా అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలని చిన్నమట్టపల్లి పంచాయతీ సర్పంచ్ పిట్ట రామారావు, పీసా ఉపాధ్యక్షుడు కోటం జయరాజు కోరారు. చింత రేగుపల్లిలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ఆగస్టు 2న కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు మొత్తం రూ.7వేలు రైతు ఖాతాలోకి వేస్తామంటున్నారు. పోలవరం ముంపులో ఉన్న రైతులకు కూడా అన్నదాత సుఖీభవ వర్తింపు చేయాలని కేంద్రాన్ని, రాష్ట్రాన్ని కోరుతున్నామన్నారు. పిట్ట రామారావు, కోట జయరాజు మడివి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు

ప్రభుత్వ హాస్టళ్లలో మెనూ అమలేదీ ?

ప్రజాశక్తి - విఆర్‌పురం: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ సక్రమంగా నిర్వహించట్లేదని నీళ్ల చారు, రసంతో సరిపెడుతున్నారని వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు ఆరోపించారు. బిసి సంఘం సమావేశం రేకపల్లిలో పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మరియదాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి హాస్టళ్లలో వసతులు సరిగా ఉండడం లేదన్నారు. కూనవరం మండల మహిళా ఉపాధ్యక్షురాలు సునీత, బిసి రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొండ గంగాధర్, బొడ్డు సత్యనారాయణ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయి ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం గుమ్మరేవులు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీ మారుమూల గ్రామాల్లో పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. జూన్‌లో పాఠశాలలు ప్రారంభించినా పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు నియమించాలని కోరారు.



శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్

రూ. 31.70 కోట్లతో హాస్టల్ భవనాలు

-కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడి -వర్చువల్‌గా శంకుస్థాపన

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో పీఎం జన్ పథకం కింద 13 హాస్టల్ భవనాల నిర్మాణానికి రూ 31.70 కోట్లు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ వెల్లడించారు. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ వసతి గృహాల భవన నిర్మాణాలకు డిల్లీ నుండి వర్చువల్ గా శంకుస్థాపన చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఈ హాస్టల్ భవనాల నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి జన్ మన్ పథకంలో 100 పడకల హాస్టల్స్ 2 భవనాలు, 50 పడకల హాస్టల్స్ 9 భవనాలు, డి ఏ జుగా కింద 100 పడకల హాస్టల్స్ 2 భవనాలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. టెండర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఇంజనీరింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డిఇఓ పి. బ్రహ్మాజీరావు, సర్వ శిక్ష ఎపిసి వి.స్వామినాయుడు, సర్వశిక్ష ఇఇ డి.వి. నరసింహరావు, డిఇఇ వేణుగోపాల్, ఎఎల్ఎస్ కో ఆర్డినేటర్ జె.కూర్మారావు, సిఎంఓఎం.జి. ప్రకాష్, ఎపిఓ, పాత్రుడు, ఎఎస్ఓ సింహాచలం పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్లో సౌకర్యాల కల్పనకు కృషి

- ఎపి స్టేట్ స్పోర్ట్స్ డైరెక్టర్ జగదీశ్వరి

ప్రజాశక్తి-అరకు లోయ: క్రీడా పాఠశాలల్లో అవసరమైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఏపీ స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కోవాసి జగదీశ్వరి అన్నారు. మంగళవారం అరకులోయ వచ్చిన ఆమె టిడిపి అరకు నియోజకవర్గం ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియారి దున్నుదొరతో కలిసి స్థానిక స్పోర్ట్స్ స్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. స్కూల్ సమస్యలు, సాధించిన మెడల్స్ వివరాలు, క్రీడ విద్యార్థుల పరిస్థితి, సౌకర్యాలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వసతి సమస్య తీవ్రంగా పట్టిపీడిస్తుందని దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని డైరెక్టర్ దృష్టికి అరకులోయ స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్ బిఎస్ఎన్ మూర్తి తీసుకెళ్లగా భవనాల నిర్మాణానికి ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం క్రీడా మైదానంలో సందర్శించి పరిశీలించారు. ఆర్చరీ గ్రౌండ్ ను సందర్శించి విలువిద్య పోటీలను తిలకించి, సరదాగా విల్లు బాణాలను విసిరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అరకు లోయ స్పోర్ట్స్ స్కూల్లో క్రీడా మైదానం ఉన్నప్పటికీ, అవసరమైన సదుపాయాలు కొరతగా ఉందని, భవనాలు లేకపోవడం వల్ల వసతి సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు ఆమె అన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఆ సమస్య పరిష్కారానికి పునాదివేస్తామన్నారు. ఈ ఏడాది నుంచి సమ్మర్ కోచింగ్ క్లాస్ లను కూడా ప్రారంభిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర, జిసిడివో జగన్మోహన్ రావు, స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపల్ పి.ఎస్.ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డైరెక్టర్

నిలిచిన రహదారి పనులకు మోక్షం

- ఫలించిన ఆదివాసీ గిరిజన సంఘం పోరాటం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రహదారులు నిర్మించాలని చేపట్టిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. అర్ధాంతరంగా నిలిచిపోయిన రహదారులు పూర్తి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆధ్వర్యంలో గతంలో ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించిన విషయం తెలిసిందే. అలాగే ఐటిడిఎ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. విషయం తెలుసుకున్న గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులు మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గిరిజన సంక్షేమశాఖ డిఇ గౌతమి అధ్యక్షతన గిరిజన సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. నిలిచిపోయిన రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు ప్రకటించారు. రాజవొమ్మంగి నుండి బూరుగుపల్లి వెళ్లే 6 కిలోమీటర్ల రహదారి రూ 2.5కోట్లతో, అమ్మిరేకుల నుండి కిమ్మలిగడ్డ 5.5 కిలోమీటర్ల రహదారి రూ3.5 కోట్లతో, డి.మల్లవరం కిలోమీటర్ రహదారికి రూ1 కోటి, కింద్ర నుండి ముంజవరప్పాడు పాడు వెళ్లే 3.5 కిలోమీటర్ల రహదారి రూ.4కోట్లతో, లోదొడ్డి నుండి పాకవెల్లి వెళ్లే 2 కిలోమీటర్ల రహదారి రూ1 కోటితో బిటి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఇఇ శ్రీనివాస్ వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చిన్నచిన్న కల్వర్టు మరమ్మత్తు పనులు చేపట్టి సెప్టెంబరు నుండి పూర్తిస్థాయిలో రహదారి పనులు చేపట్టనున్నట్లు దానికి అనుగుణంగా యాక్షన్‌ప్లాన్ తయారుచేసినట్లు తెలిపారు. నిధులు విడుదల కాగానే రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. ఏ ఏ రహదార్లు ఎప్పుడు పనులు ప్రారంభిస్తున్నారో తెలపాలని లోతా రామారావు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, బడదనాంపల్లి ఎంపిటిసి చంద్రు లోవలక్ష్మి, గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కుంజం జగన్నాథం, కొండ్ల సూరిబాబు పాల్గొన్నారు.




అధికారులతో మాట్లాడుతున్న లోతా రామారావు

ఆదివాసీ దినోత్సవానికి గిరిజనులంతా కలిసిరావాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి - రంపచోడవరం : ఆగస్టు 9వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఏజెన్సీలోని గిరిజన తెగలంతా కలిసికట్టుగా ఐక్యతతో ముందుకు రావాలని రంపచోడవరం పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో సమావేశపు హాలులో ఆగస్టు తొమ్మిదో తారీఖున ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని గిరిజన సంఘాల ప్రతినిధులతో, గిరిజనులతో రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ వచ్చేనెల తొమ్మిదో తారీఖున ప్రపంచ ఆదివాసి దినోత్సవం అన్ని తెగల గిరిజనులతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని తెగల గిరిజన సంఘాలతో గిరిజన ప్రతినిధులతో ముందస్తు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహించేందుకు ఒక్కొక్క మండలానికి పదివేల రూపాయలు చొప్పున ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. రంపచోడవరంలో జరుగు ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి వచ్చిన గిరిజనులందరికీ భోజన సదుపాయం ఐటిడిఎ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వచ్చేనెల 9న ఆదివాసీ దినోత్సవం ఏ విధంగా నిర్వహించాలో గిరిజన సంఘాల అభిప్రాయాలు, గిరిజనుల అభిప్రాయాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గిరిజన తెగలకు సంబంధించిన నాయకులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ కట్టా సింహాచలం

బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ చినబాబు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

విద్యార్థినులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జడ్డంగి ఎస్ఐ చినబాబు అన్నారు. మంగళవారం మండలంలోని అమీనాబాద్ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ చినబాబు మాట్లాడుతూ బాలికలపై సోషల్ మీడియా ప్రభావం, బాల్యవివాహాలు, పోక్సో చట్టం, మహిళలకు సంబంధించిన హక్కులు, శక్తి యాప్ అవశ్యకత తదితర అంశాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సాహిత్

నాణ్యమైన విద్య అందించాలి

అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

ప్రజాశక్తి-అరకులోయ: విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ కె సాహిత్ సూచించారు. మంగళవారం ఎండపల్లివలస ఏం ఆర్ ఎస్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో జరిగిన టీచర్స్ లీడర్ షిప్ ట్రైనింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,డ కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలలకు పెద్దగా వ్యత్యాసం లేదని చెప్పారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్లో రెండు సంవత్సరాలు టీచర్ గా విధులు నిర్వహించానని చెప్పారు . ప్రతిచోట విద్యార్థుల అభ్యసన విధానం ఒకేలా ఉందని పేర్కొన్నారు. అనంతరం ఏంఆర్ఎస్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీసి డాక్టర్ స్వామి నాయుడు, అరకులోయ ఎంఈఓ వి.త్రినాధరావు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రోడ్డు



ప్రజాశక్తి-చింతపల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, జికె వీధి మండలాలను కలిపే కీలక రహదారి-కొండకించంగి నుండి సత్యవరం వరకు రహదారి రాళ్ల తేలి ఉండటంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో గ్రామస్తులు శ్రమదానంతో కొంతమేరకు మట్టి రహదారిని వేసినా, వర్షాకాలంలో అది పూర్తిగా ధ్వంసమై రాళ్లు తేలిపోయాయి. ఈ మార్గం గుండా చింతపల్లి మండలంలోని చౌడుపల్లి, జర్రెల పంచాయతీలు, జికె వీధి మండలంలోని కొండకించంగి, సత్యవరం గ్రామాలను కలుపుతుంది. ఇప్పటికే కొండకించంగి వరకు జర్రెల పంచాయతీ నుండి తారు రహదారి నిర్మించగా, సత్యవరం నుండి చౌడుపల్లి వరకు తారు రహదారి పూర్తయింది. కానీ మధ్య భాగమైన కొండకించంగి-సత్యవరం మూడు కిలోమీటర్ల దారిని వదిలేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికి దారి తీస్తోంది. ప్రజలు ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు చేసినా స్పందన కనిపించ లేదు. తక్షణమే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, మిగిలిన మూడు కిలోమీటర్ల దారిని మెరుగుపరచాలని వాహనదారులు కోరుతున్నారు.

సాంకేతిక ప్రగతితో దేశ సుస్థిర అభివృద్ధి

గీతంలో బ్రహ్మాస్ ఏరోస్పేస్ ఎమ్‌డి శివధాను పిళ్లై

ప్రజాశక్తి-మధురవాడ : సమాచార సాంకేతిక రంగం, అంతరిక్ష ప్రయోగాలు, రక్షణ రంగ పరిశోధనలలో సాధిస్తున్న ప్రగతి దేశ సుస్థిర అభివృద్ధికి దారితీస్తుందని ప్రఖ్యాత అంతరిక్ష శాస్త్ర పరిశోధకుడు, బహ్మాస్ ఏరోస్పేస్ ఎమ్‌డి డాక్టర్ శివధాను పిళ్లై పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి, కండిషన్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎమ్ఎస్ఐ) సంయుక్తంగా నిర్వహించిన డాక్టర్ వి.భుజంగరావు ఎండోమెంట్ లెక్చర్ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతరిక్ష పరిశోధనల ఫలితంగా 2040 సంవత్సరం నాటికి చంద్రమండలంపై భారతీయ అంతరిక్ష స్టేషన్ నెలకొల్పడంతో పాటు 2047 నాటికి పెద్ద ఎత్తున వ్యోమగాములను పంపే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. సౌరశక్తిని ఇందనంగా మలుచుకోవడానికి సోలార్ పవర్ జనరేటింగ్ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశ పెట్టే పరిశోధనలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. అంతరిక్ష ప్రయోగాల అంతిమ లక్ష్యం మానవాళికి మేలు చేయడమేనని చెప్పారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా మైనింగ్ ప్రక్రియ

జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో పర్యావరణానికి వ్యవసాయానికి ప్రజలకు హాని కలగకుండా మైనింగ్ ప్రక్రియ జరగాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. గనులు భూ గర్భ శాఖ, పరిశ్రమలు, ఎపి ఇపిడిసి ఎల్, ఎస్ ఎం ఐ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో మంగళవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక గిరిజనులతో మైనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎటపాక మండలంలో రెండు ఇసుక నిల్వల కేంద్రాలు ఉన్నాయని మైనింగ్ అధికారులు జిల్లా కలెక్టర్కు వివరించారు. మూడు వేల టన్నుల ఇసుకను స్టాక్ పాయింట్లలో అందుబాటులో ఉందన్నారు. హుకుంపేట మండలంలో గెడ్డల నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మధ్యతరహా పరిశ్రమలు ఎన్ని ఉన్నాయని మండల అధికారులను ఆరాతీసారు. లేకపోతే ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు, బ్యాంకర్లు, రైతు ఉత్పత్తి దారుల సంఘాలు, ఉత్పత్తి దారులతో వర్క్‌షాపు నిర్వహించాలని చెప్పారు. చిన్న నీటి పారుదల వనరులను మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరందించాలని చెప్పారు. ప్రభుత్వ వసతి గృహాలు, వారపు సంతలు తనిఖీ చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం ఐటిడి ఏ పి ఓలు ఎం.జె. అభిషేక్ గౌడ, కె.సింహాచలం మైనింగ్ సహాయ సంచాలకులు ఎం.ఆనంద్, ఎస్.ఇ. ఎపి ఇపిడిసి ఎల్ జి. ఎన్ ప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి జి.రవి శంకర్, సిపిఓ పి.ప్రసాద్, జిల్లాఫుడ్ సేఫ్టీ అధికారి బి.వేణుగోపాల్, ఎంపిడి ఓలు తదితరుతలు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ అందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. ఆధార్ సంఖ్యను బ్యాంకు ఖాతాలతో సక్రమంగా అనుసంధానం చేసి అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ అందించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి 22 మండలాల తహశీల్దార్లు, సర్వేయర్లు, డిప్యూటీ తహశీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి అర్జీదారులను కార్యాలయాలకు తిప్పకూడదన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ సక్రమంగా చేయకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. భూ వివాదాలను తహశీల్దారులు, ఎంపిడి ఓలు, సబ్ ఇన్స్పెక్టర్లు సంయుక్తంగా పరిష్కారం చూపించాలని అన్నారు.జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ మాట్లాడుతూ భూముల రీసర్వే, 13 నోటిఫికేషన్ జారీ, రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారం, జి ఓ నెం 23 ప్రకారం హౌస్ సైట్ల పరిశీలనపై సమీక్షించారు. భూములు రీ సర్వే పకడ్బందీగా చేయించ వలసిన బాధ్యత తహశీల్దారులపైనే ఉందన్నారు. పిజిఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులను త్వరత్వరగా పరిష్కారం చూపించాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి ఆర్ ఓ కె. పద్మావతి, వర్చువల్గా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, 22 మండలాల తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అభివృద్ధికి తోడ్పాటు

జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకంగా అమలు చేస్తున్న పి 4 బంగారు కుటుంబాల అభివృద్ధికి అసరగా ఉంటామని ఇంచార్జి ఐటిడి ఏ పి ఓ జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ అన్నారు. పెదబయలు మండలం పోయిపల్లి పంచాయతీ సైలంకోట గ్రామానికి చెందిన 'జర్సింగ్ తెల్లన్న బంగారు కుటుంబాన్ని ఆయన దత్తత తీసుకున్నారు. భార్య ఒక కుమార్తె ఇద్దరు మగ పిల్లలున్నారు. కుమార్తె రమాదేవి సూపర్ 50 కి ఎంపికై ప్రస్తుతం మారిక వలన కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. మంగళవారం జెసి క్యాంపు కార్యాలయంలో దత్తత బంగారు కుటుంబంతో సమావేశం అయ్యారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి అడిగితెలుసుకున్నారు. 2023 సంవత్సరంలో కాఫీ తోట పెంపకం చేపట్టామని తెల్లన్న వివరించారు. రమాదేవి ఉన్నత చదువులు చదవాలని సూచించారు.చదువులకు ప్రోత్సాహం అందిస్తానన్నారు. వ్యవసాయానికి సహకారం అందిస్తామన్నారు. గ్రామంలో ఉన్న నీటి వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు...

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిఐ హిమగిరి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: -విద్యార్థులు హైస్కూల్ దశ నుంచే భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని అరకు సీఐ హిమగిరి అన్నారు. మండలంలోని మారుమూల నందివలస ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో గుడ్, బ్యాడ్ టచ్, పోక్సో, బాల్య వివాహాల నిషేద చట్టం, గంజాయి, మాదకద్రవ్యాల వ్యతిరేకతపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సరోమా, వార్డెన్ కళావతి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దొన్ను దొర

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి-అరకులోయ: ప్రభుత్వం అమలు పరిచిన వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజెప్పడానికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం వేదికగా నిలుస్తుందని విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ అరకు నియోజకవర్గ సియ్యారి దొన్ను దొర అన్నారు. అరకులోయ టౌన్ షిప్ లోని వివిధ వీధుల్లో, దుకాణాల్లో మంగళవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుపరిపాలన తొలి అడుగు ద్వారా ప్రజలకు మరింతగా చేరువయ్యే అవకాశం ఏర్పడిందన్నారు. ఎన్నికల హామీలు అమలుపరిచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జగదీశ్వరి, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేది దాసు బాబు, అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, పార్టీ నాయకులు నాగరాజు, వెంకటరావు, పెట్టేది రాము, చందు తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు ఇస్తున్న నాయకులు

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : వైసిపి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని మారుమూల పిన్నకోట పంచాయతీలో వైసిపి మండల అధ్యక్షులు కొర్రా. సూర్యనారాయణ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శెట్టి నీలవేణి. మాజీ జెడ్పిటిసి దూరు గంగన్న దొర హాజరయ్యారు. ముందుగా పంచాయితీ గ్రామస్థాయి కమిటీ నియామకంలో భాగంగా అనుబంధ విభాగాలు అధ్యక్ష కార్యదర్శుల కమిటీని నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి సర్పంచులు ఎంపీటీసీలు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాబోయే ఎన్నికలలో సర్పంచ్, ఎంపీటీసీ .ఎంపీపీ, జడ్పిటిసి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చాడు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శకుంతల, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు

క్షయ వ్యాధిపై అవగాహన



ప్రజాశక్తి-చింతపల్లి: విద్యార్థులు నిలువ పదార్థాల (బయట తినే నిల్వ చేసి ఉంచిన తినుబండారాలు)కు దూరంగా ఉండాలనీ తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి భవాని తెలిపారు. తాజంగిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో క్షయవ్యాధి అవగాహన కార్యక్రమంలో ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలపాటు దగ్గు, బరువు తగ్గిపోవడం, ఆకలి తగ్గడం, జ్వరం, శ్వాసకోశ సమస్యలు వంటి లక్షణాలు క్షయవ్యాధికి సూచికలుగా కనిపిస్తాయన్నారు.లక్షణాలు గమనించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి ఉమ్మి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కాచిన నీటిని చల్లార్చి తాగాలని, వేడి ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ స్వామి, హెల్త్ సూపర్వైజర్ పడాల్, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో పెరిగిన అడ్మిషన్లు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పెరిగినట్లు ప్రిన్సిపల్ బల్లంకి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. తల్లికి వందనం, ఉచితపాఠ్య పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం అమలు చేయడం, పూర్తిస్థాయిలో అధ్యాపకులు,ఉత్తమ విద్య బోధన, ఉత్తమ ఫలితాలు వలన ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ప్రవేశాలు పెరిగినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం ఇంటర్‌లో 188 మంది ప్రవేశం పొందగా, ఈ ఏడాది 220 మంది చేరారని తెలిపారు. ఈ నెల 31 వరకు ప్రవేశాలకు గడువు ఉందని ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



పర్యటిస్తున్న స్వచ్ఛసర్వేక్షణ్ టీం

పుల్లంగి పంచాయతీలో పర్యటన

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మండలంలోని పుల్లంగి పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ (ఎస్ఎస్‌జిటీం) మంగళవారం పర్యటించారు. స్కూల్స్ , అంగన్వాడి, పంచాయతీ భవనం, బిపిఎల్ కుటుంబాలు, స్వాప్‌షెడ్ నిర్వహణ, ఐహెచ్‌హెచ్ఎల్ మరుగుదొడ్లు ఇలా పలు అంశాలపై సర్వే చేశారు. పంచాయతీ సర్పంచ్ వీరవల్లి జార్జిబాబు స్వచ్ఛసర్వేక్షన్ గ్రామీణ్ టీంకు పంచాయతీ స్థితిగతులను తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి గున్నమ్మ, ఎఎంఎస్ సెంట్రల్ టీమ్ మెంబర్ రామచంద్ర, పంచాయతీ కార్యదర్శి అభిలాష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సిఐటియు నాయకులు

సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలి

ప్రజాశక్తి - అడ్డతీగల: రాష్ట్ర ప్రభుత్వం సాధికార సర్వేలో అంగన్వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడం వలన అతితక్కువ వేతనాలు కలిగిన కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, తక్షణమే సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం అడ్డతీగల తహశీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రూ. 10వేల లోపు ఆదాయం వచ్చే వారికి అన్ని సంక్షేమ పథకాలు వర్తింపచేస్తామని చెప్తూనే రూ. 7వేలు వేతనాలు వస్తున్న మినీ వర్కర్లకు,హెల్పర్లకు మాత్రం సంక్షేమ పథకాలు వర్తింప చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసినందున ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ ఇవ్వాలని, లేదా ప్రభుత్వ ఉద్యోగులు అనే పదం సాధికారత సర్వేలో తొలగించి అంగన్వాడి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకొని వెళ్తానని హామీ ఇచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు నిర్మల, శాంతిరాజు, అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు బేబీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూస్వాముల భూములు ఆదివాసీలకే దక్కాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్



మాట్లాడుతున్న పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-విఆర్‌పురం: 2010లో పోలవరం భూనష్టపరిహారం తీసుకున్న స్థానికేతర గిరిజనేతర భూస్వాముల భూములు సాగు చేసుకునే హక్కు ఏజెన్సీలో స్థానిక నిరుపేద ఆదివాసీలకే ఉందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం విఆర్ పురం మండలం చొక్కనపల్లిలో తోడంరాజు, ఆత్మకూరి కాంతారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం భూనష్టపరిహారం తీసుకొన్నారని, ఆ భూమిని నేటికీ 20 వేల నుంచి 25 వేల వరకు స్థానికంగా ఉన్న గిరిజనేతర భూస్వాములకే కౌలుకి ఇస్తున్నారని అధికారులు చోద్యం చూస్తున్నారని అందుకే ఆ భూములను స్థానిక ఆదివాసీలే సాగు చేసుకోవాలని భూ ఉద్యమం చేపట్టామన్నారు. ఐక్యంగా భూమిని సాగు చేసుకుని వచ్చిన ఆదాయాన్ని అంతా సమానంగా తీసుకోవాలని ఆదివాసీలను కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు సున్నం సీతమ్మ, సోడి చిన్న బూబమ్మ, వార్డుసభ్యులు గొంది ధారయ్య, రైతుసంఘం నాయకులు పంకు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్టు



మీడియాతో మాట్లాడుతున్న డిఎస్‌పి సాయిప్రశాంత్

ప్రజాశక్తి - రంపచోడవరం : పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందని రంపచోడవరం డిఎస్‌పి సాయిప్రశాంత్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా జరుగుతుం దని అందిన సమాచారం మేరకు రంపచోడవరం మండలం పందిరిమామిడి నుండి తాళ్లపాలెం వెళ్లే మార్గమధ్యలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 1146 కేజీల గంజాయిని గత నెల 27 స్వాధీనం చేసుకోవడం జరిగిందని అయితే ముద్దాయిలు వాహనం వదిలి పారిపోవడంతో వారి గురించి గాలింపు చేసి వారు వదిలిన వాహనాలు ద్వారా వారి సమాచారం తెలుసుకుని ముద్దాయిలను పాడేరు, చింతపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో అరెస్టు చేసి రిమాండ్‌కి పంపామని ఆయన తెలిపారు. వారి వద్దనుండి ఒక బొలెరో వాహనం, ఒక మోటార్‌సైకిల్ సుమారు కోటి 15 లక్షల విలువచేసే 1146 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గంజాయి విక్రయం, కొనుగోలు,అక్రమ రవాణాకు పాల్పడితే అటువంటి వారిపై కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రంపచోడవరం ఎస్ఐ వెంకటరావు మరియు ట్రైనింగ్ ఎస్ఐ పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి -కూనవరం: ఆగస్టు 8, 9 తేదీల్లో రంపచోడవరంలో జరగనున్న సిపిఐ రెండో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కూనవరం డివిజన్ సమితి నాయకులు కరపత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. జిఓ నంబర్3ని పునరుద్ధరించేలా ఉద్యమించేందుకు, ఏజెన్సీ ప్రజల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉద్యమ రూపకల్పన చేసేందుకు ప్రతి ఒక్కరు మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా మహాసభల నిర్వహణకు ఆర్థిక సహాయాన్ని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ మోహన్‌రావు, మండల కన్వీనర్ శ్రీనివాసరావు, విఆర్ పురం మండల కన్వీనర్ కర్నాటి ఏసుపాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా ప్రపంచవ్యాప్త పెనుసమస్య

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్త పెను సమస్యలా పరిణమిస్తుండడం విచారకరమని విశాఖ జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఈ నెల 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం, ఎటిఎస్ఎసి ఇండియా సంస్థ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్,హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, సిఐడి, ఎహెచ్‌టియు నోడల్ ఏజెన్సీ, రాష్ట్ర పోలీసు శాఖలతో పాటు రాష్ట్రంలో ప్రఖ్యాత 14 ఎన్‌జిఒ సంస్థల సమన్వయంతో రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం జెడ్పీ చైర్మెన్ క్యాంప్ ఆఫీస్‌లో సుభద్ర చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా ఈ అక్రమ రవాణాలో పిల్లలు, మహిళలు పేదవారు, నిరక్షరాస్యులు సమిధలుగా మారుతుండటం బాధాకరమన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడుతూ బాలిక అక్రమ రవాణా వ్యవస్థను రూపు మాపేందుకు విస్తత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం ప్రతినిధులు ఎల్లయ్య, బి.లవకుశ, ఎం.ప్రవీణ్‌త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

ఆశా వర్కర్ పోస్టులకు ఇంటర్వ్యూలు


ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్లను ప్రభుత్వ నిబంధన ప్రకారం అర్హులైన వారిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో ఆశ వర్కర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ 33 ఆశ వర్కర్ల పోస్టుల ఖాళీలను ప్రభుత్వ నిబంధన ప్రకారం పరీక్షలు, ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులైన వారిని నిబంధనల ప్రకారం ఆశ వర్కర్లుగా నియమిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి యం. సావిత్రి, డియంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జెన్‌కో కాలనీలో ఇంటి పైకప్పుల మీద తిరుగుతున్న కోతులు

కోతుల బెడద నివారించాలి

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో కోతులు సంచారం అధికంగా ఉండడంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటి పైకప్పుల పైన, ఎపి జెన్కో కాలనీలో వీరంగం చేస్తున్నాయి. ఎపి జెన్కో కార్యాలయం, జెన్‌కో ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో కోతులు ఎక్కువ తిరుగుతున్నాయి. స్థానిక డిఎవి పాఠశాల, కాన్వెంట్ పరిసరాల్లో కోతులు గుంపులు గుంపులుగా తిష్ట వేయడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. మార్కెట్లో దుకాణాల్లో చొరబడి తినుబండారులు ఎత్తుకెళుతున్నాయి. ఇప్పటికైనా ఎపి జెన్‌కో అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఎండిడిఒ యాదగిరిశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘ నాయకులు

రహదారులు పాడవకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రహదారులపై దమ్ము చక్రాలతో ఉన్న ట్రాక్టర్లు తిరగడం వలన రోడ్లు పాడైపోతున్నాయని వీటిని తిరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, కొండపల్లి లోదొడ్డి, చికిలింత సర్పంచ్‌లు కుంజం జగన్నాథం, కొండ్ల సూరిబాబు, దూసరపాము మాజీ సర్పంచ్ కనిగిరి దుర్గాప్రసాద్ మంగళవారం అధికారులను కోరారు. ఎండిడిఒ లోకుల యాదగిరిశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం నేతలు గంగరాజు, ప్రవీణ్, బాబురావు, దొరబాబు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.